నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, శనివారం 21 డిసెంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET


# రుణమాఫీ చేయకుంటే ఉద్యమం



మాట్లాడుతున్న రైతు సంఘం నేత రామచంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన రుణమాఫీ వర్తించని రైతులు

- ఇంకా 50శాతం మంది రైతులకు వర్తించని రుణమాఫీ..
- ఉద్యమ కార్యాచరణ కోసం జేఏసీ ఏర్పాటు..
- కల్వకుర్తిలో సమావేశమైన రుణమాఫీ కాని రైతులు..

కల్వకుర్తి, డిసెంబర్ 20 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు అర్హత ఉన్న ప్రతి రైతుకు రూ.2లక్షల రుణ మాఫీ చేయకుంటే ఉద్యమం తప్పదని జేఏసీ నాయకులు హెచ్చరించారు. శుక్రవారం కల్వకుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డులో రుణమాఫీ కాని రైతులు సమావేశం అయ్యారు. ఇంకా 50శాతం మంది రైతులకు రుణమాఫీ కావాల్సి ఉందని, ప్రభుత్వం మాత్రం వందశాతం రుణాలు మాఫీ చేశామని ప్రకటనలు ఇస్తుందని వారు ఆందోళన వ్యకం చేశారు. ముఖ్యమంత్రితోపాటు మంత్రులు రోజుకో రీతిన అర్థం కాని విధంగా ప్రకటనలు ఇస్తూ గందరగోళ పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిందని, ఇప్పటికీ ఏడాది దాటినా.. రుణమాఫీపై ప్రభుత్వం అస్పష్టంగా తప్పించుకునే పద్ధతిన ముందుకు సాగుతుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఏలాంటి కొర్రీలు లేకుండా అమలు చేస్తామని హామీ ఇచ్చి తీరా అధికారంలోకి వచ్చాకా డొంక తిరుగుడు మాటలతో కాలం గడిపేలా ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని దుయ్యబట్టారు. అత్యంత దురదృష్టం ఏమిటంటే.. ఇప్పటికి 50శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదని, వారికి ఎందుకు రుణమాఫీ కాలేదో ఎవరికీ అర్థం కావడం లేదన్నారు. కేవలం కల్లబొల్లి మాటలు చెబుతూ.. కొర్రీలు పెడుతూ రైతు రుణమాఫీని ఎగ్గొట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తుందని తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు వీలుగా రుణమాఫీ కాని రైతులతో మండలాల వారీగా జేఏసీ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ సిద్ధం చేశారు. కార్యక్రమంలో భాగంగా రుణమాఫీ కాని రైతుల జేఏసీ నాయకుడు బండెల రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి రైతుకూ రుణమాఫీ అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వీలుగా మండలాల వారీగా జేఏసీలను ఏర్పాటు చేయాలని ఉద్యమ సన్నాహక సదస్సులో నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. కుటుంబ నిర్ధారణ చేసిన తర్వాత కూడా రుణమాఫీ చేయలేదని, 4వ విడుతలో రైతు రుణమాఫీకి సంబంధించిన జాబితా ప్రకటించి 20రోజులు గడుస్తున్నా.. ఇప్పటికీ రుణమాఫీ డబ్బులు సంబంధిత రైతుల ఖాతాల్లో జమచేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం రైతులను మోసం చేయడానికి ప్రభుత్వం ఆడుతున్న డ్రామాగా తాము భావిస్తున్నామని రైతు నేత రాంచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఉద్యమ కార్యాచరణలో భాగంగా ప్రతి గ్రామం నుంచి రుణమాఫీ కాని రైతులు జాబితా సేకరించి మొదట తాసీల్దార్, ఆర్డీవోలకు వినతిపత్రాలు అందజేస్తామని చెప్పారు. అప్పటికి ప్రభుత్వం స్పందించకుంటే చలో కలెక్టరేట్, చలో సచివాలయం నిర్వహిస్తామని హెచ్చరించారు. పూర్తి రుణమాఫీ చేయకుండా, రైతు భరోసా ఇవ్వకుండా, పెండింగ్ పాల బిల్లులు చెల్లించకుండా ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలకు వస్తే.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు డిపాజిట్ కూడా దక్కకుండా ఘోర ఓటమి చవిచూసేలా తమ ఉద్యమం ఉంటుందని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో వెంకటయ్య, రామకృష్ణారెడ్డి, శ్రీను, కృష్ణారెడ్డి, తిరుపతి రెడ్డి, యాదగిరిరెడ్డితోపాటు వంగూర్, ఊర్కొండ, కల్వకుర్తి మండలాల రైతులు పాల్గొన్నారు.

# సరిహద్దుపై త్వరలో శాశ్వత పరిష్కారం



తుంగభద్ర నదిలో సరిహద్దు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, అధికారులు

- సమస్య పరిష్కరించే వరకు ట్రాక్టర్లు వెళ్లొద్దు..
- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ

రాజోళి, డిసెంబర్ 20 : రాజోళి మండల పరిధిలోని తూర్పు గార్లపాడు గ్రామ శివారులో ప్రభుత్వ అనుమతులతో ఏర్పాటు చేసిన ఇసుక రీచ్ దగ్గర ఏపీకి చెందిన గ్రామస్తులు పోలీస్ అధికారులతో సమస్యలు కొనసాగుతూనే ఉన్నాయి. గురువారం అనుమతులతో ఇక్కడి నుంచి ఇసుకను తరలిస్తుండగా ఏపీకి చెందిన ఆర్ కొంతలపాడు గ్రామస్తులు అక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చి అడ్డుకున్నారు. రాజోళి మండల అధికారులు ఏపీ సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఈ విషయంపై జిల్లా అధికారులకు సమాచారం ఇవ్వడంతో శుక్రవారం అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, మైనింగ్ ఏడీ రమణ, డీఎస్పీ సత్యనారాయణ సరిహద్దు ప్రదేశంలో సమస్యపై తుంగభద్ర నదిలో తెలంగాణ సరిహద్దు ప్రాంతం దగ్గరకు ట్రాక్టర్‌లో వెళ్లి పర్యవేక్షించారు. ఈ సమస్యపై స్థానికులు సంబంధిత అధికారులతో మాట్లాడుతూ ఏపీకి చెందిన గ్రామస్తులు అనుమతులతో ఇసుకను తరలిస్తుంటే కట్టెలతో దాడి చేస్తూ అడ్డుకుంటూన్నారని తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఏపీకి చెందిన జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ఇరువురి అధికారుల సమక్షంలో గూగుల్ మ్యాప్ ఆధారంగా సర్వే నిర్వహించి సరిహద్దులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. తుంగభద్ర నది మధ్యలో సరిహద్దు సర్వే నిర్వహించి సమస్య పరిష్కరించే వరకు ట్రాక్టర్లు నదిలోకి వెళ్లవద్దని యజమానులకు తెలిపారు. అదనపు కలెక్టర్ వెంట తాసీల్దార్ రామ్మోహన్, సీఐ టాటా బాబు, రాజోళి ఎస్సై జగదీశ్, కర్నూల్ ఎస్సై రామాంజనేయులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


# మూతపడిన పల్లె దవాఖాన

ధన్వాడ, డిసెంబర్ 20: గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పల్లెల్లో పల్లె దవాఖాలను ఏర్పాటు చేసింది. ప్రస్తుతం డాక్టర్లు లేక అవి మూతపడుతున్నాయి. మండలంలోని చర్లపల్లి పల్లె దవాఖానలో గతంలో డాక్టర్ అనురాధ పని చేసేవారు. ప్రస్తుతం డాక్టర్లు లేకపోవడంతో ఈ దవాఖాన మూతపడింది. దీంతో చర్లపల్లి గ్రామస్తులు వైద్యం కోసం ఇతర గ్రామాలకు వెళ్లే దుస్థితి నెలకొంది. ఎమ్మెల్యే స్పందించి చర్లపల్లి పల్లె దవాఖానలో డాక్టర్‌ను నియమించి వైద్యసదుపాయం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.




ధన్వాడ మండలం చర్లపల్లిలో మూతపడిన పల్లెదవాఖాన

- బీఆర్‌ఎస్‌వీ జిల్లా నేత కుర్వ పల్లయ్య
- అయిజలో నిరసన తెలిపిన విద్యార్థి విభాగం నాయకులు
- అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు



అయిజలో నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్‌వీ నేతలు

## కేటీఆర్‌పై కేసు

# రేవంత్ కుట్రే..

అయిజ, డిసెంబర్ 20 : తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకు, పర్యావరణ పరిరక్షణ కోసం ఎలక్ట్రిక్ వాహనాల వినియోగాన్ని ప్రోత్సహించి ఫార్ములా ఈ – రేస్ నిర్వహించిన బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌పై కక్ష పూరితంగా వ్యవహరిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి కేటీఆర్‌పై అక్రమంగా కేసు నమోదు చేయించారని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నేత కుర్వ పల్లయ్య ఆరోపించారు. బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆదేశాల మేరకు శుక్రవారం అయిజ పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో తెలంగాణ తల్లి విగ్రహం వద్ద బీఆర్‌ఎస్వీ నాయకులు శాంతియుతంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కుర్వ పల్లయ్య మాట్లాడుతూ ఫార్ములా ఈ – రేస్‌లో కేటీఆర్ తప్పు లేకపోయినా కాం గ్రెస్ ప్రభుత్వం అక్రమంగా కేసు నమోదు చేయడం చూస్తుంటే కేటీఆర్‌ను ఎదుర్కోలేక ఏసీబీతో కుట్రలు పన్ని కేసుల్లో ఇరికించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి అడ్డదారులు వెతుక్కొని కుట్రలకు తెరలేపాడని విమర్శించారు. కాంగ్రెస్ సర్కారు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని, రేవంత్‌రెడ్డి కుంభకోణాలను ఎప్పటికప్పుడు వెలికి తీస్తుండడంతో డైవర్సన్ పాలిటిక్స్ చేస్తూ కాలయాపన చేసేందుకే కుట్రలతో బీఆర్‌ఎస్ శ్రేణులపై కేసులు నమోదు చేస్తూ జైళ్లకు పంపి పబ్బంగడుపుతుందన్నారు. దేశంలోనే ఎక్కడాలేని విధంగా ఫార్ములా ఈ – రేస్‌ను హైదరాబాద్‌లో శాంతియుతంగా నిర్వహించి ప్రపంచ స్థాయికి తెలంగాణ ఇమేజ్‌ను తెచ్చిన మాజీ మంత్రి కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టడం చూస్తుంటే తెలంగాణ బ్రాండ్ ఇమేజ్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీసేందుకు కుట్రపన్నిందని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో దొరికిన దొంగ రేవంత్‌రెడ్డి అని అన్నారు. ఓటుకు నోటు కేసును దృష్టిలో ఉంచుకొని పగతోనే కేటీఆర్‌పై కేసు నమోదు చేయించారని మండిపడ్డారు. కేటీఆర్ జోలికొస్తే తెలంగాణలో పుట్టగతుల్లేకుండా చేస్తామని హెచ్చరించారు. ఎలాంటి తప్పుచేయని కేటీఆర్‌పై ఎన్ని కేసులు పెట్టినా కడిగిన ముత్యంలా బయటకు రావడం ఖాయమన్నారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్‌వీ నేతలను ట్రైనీ ఎస్సై కిరణ్ కుమార్, పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంతపూచీకత్తుపై విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ పట్టణ, మండల అధ్యక్షులు వీరేశ్, మత్తాలి, మాజీ అధ్యక్షుడు కుర్వ వీరేశ్, రఫీ, మాధవ్, ఆంజనేయులు, రాజు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.




బీఆర్‌ఎస్‌వీ నేత పల్లయ్య, నేతలను అరెస్టు చేసి పోలీస్ వాహనంలో తరలిస్తున్న దృశ్యం

# అడుగడుగునా అడ్డగింత

- ఉమ్మడి జిల్లాలో ఆటో డ్రైవర్ల ముందస్తు అరెస్టు
- అసెంబ్లీ ముట్టడికి వెళ్లకుండా నిర్బంధం
- పోలీస్ స్టేషన్లకు తరలింపు, సాయంత్రం విడుదల
- రేవంత్ సర్కారుకు వ్యతిరేకంగా ఆటో జేఏసీ కార్మికుల నినాదాలు

ఆటో డ్రైవర్లపై పోలీసుల నిర్బంధం కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న ఆటో కార్మికులను పోలీసులు ఎక్కడికక్కడ అడ్డగించారు. ఆటో యూనియన్ నాయకులు, డ్రైవర్లను ముందస్తుగా అరెస్టు చేసి ఆయా పోలీస్‌స్టేషన్లకు తరలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆటో డ్రైవర్లకు గిరాకీ లేకుండా చేసి కడుపుకొడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోజు వారీగా ఫైనాన్స్ డబ్బులు కట్టలేకపోతున్నామని, మాకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలన్నారు. ప్రమాద బీమా, హెల్త్ ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని కోరారు. లేదంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అక్రమ అరెస్టులు ఎన్ని చేసినా ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. అనంతరం సాయంత్రం సొంత పూచీకత్తుపై నాయకులను విడుదల చేశారు. ఆటో డ్రైవర్ల అరెస్టును కార్మిక సంఘాలు ఖండించాయి.

**- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 20**

జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో..






నారాయణపేటలో అరెస్టయిన ఆటో డ్రైవర్లు



కోడేరు పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు

## నిరసన జ్వాల



మహబూబ్‌నగర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అమిత్‌షా దిష్టిబొమ్మ దహనం




వనపర్తి జిల్లా కేంద్రంలో అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నేతలు

- అమిత్‌షా వ్యాఖ్యలపై ఉమ్మడి జిల్లాలో భగ్గు భగ్గు
- పలు చోట్ల దిష్టిబొమ్మల ఊరేగింపు, దహనం
- మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని నినాదాలు
- దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్

పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కించపరిచేలా కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా వ్యాఖ్యలపై ఊరువాడా భగ్గుమన్నది. ఉమ్మడి పాలమూరు జిల్లా వ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. కేవీపీఎస్, తెలంగాణ మాదిగ హక్కుల దండోరా, సీఐటీయూ, సీపీఐ ఆధ్వర్యంలో ర్యాలీ చేపట్టి అమిత్‌షా దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బడుగుల ఆశాజ్యోతి అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్‌షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్యాన్ని కించపరిచేలా మాట్లాడిన షా దేశ ప్రజలకు క్షమాపణలు చెప్పాలన్నారు.

**- నెట్‌వర్క్ మహబూబ్‌నగర్, డిసెంబర్ 20**

# తప్పుల తడకగా ఆన్‌లైన్ నమోదు

- ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు నోచుకోని అర్హులు
- ఇబ్బందులు పడుతున్న పేదలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు



ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతున్న సలీమాబేగం

అమరచింత, డిసెంబర్ 20 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల ముందు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి హామీల అమలు కోసమని ప్రజాపాలన కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. అయితే దరఖాస్తులను మున్సిపల్ అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో ఒకరికి బదులు మరొకరి పేర్లను నమోదు చేయడంతో అనేక మంది నిరుపేదలు ఇందిరమ్మ ఇండ్ల సర్వేకు నోచుకోక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలు కోసం జనవరి నెలలో అమరచింత మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన ప్రజాపాలనలో ఆరో వార్డు (బీసీ కాలనీ)లో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న సలీమాబేగంకు నలుగురు ఆడపిల్లలు ఉండగా ఇందిరమ్మ ఇంటి కోసం ఆమె దరఖాస్తు చేసుకున్నది. అయితే దరఖాస్తును ఆన్‌లైన్‌లో నమోదు చేసే సమయంలో డేటా ఆపరేటర్ ఆమె పేరుకు బదులుగా వై లక్ష్మి పేరును నమోదు చేశారు. వారం రోజుల నుంచి పట్టణంలో అధికారులు ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేపట్టగా ప్రభుత్వం నుంచి వచ్చిన లిస్టు ఆధారంగా సర్వేతోపాటు దరఖాస్తుదారుల ఫొటోలను తీసుకుంటున్నారు. కానీ ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న సలీమాబేగం తన పిల్లలను వెంటబెట్టుకొని తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వారం రోజుల నుంచి తిరుగుతుండగా అధికారులు ఆధార్, ఫోన్ నెంబర్ ఆధారంగా నీ పేరు లిస్టులో తప్పుగా ఉందని పేరు సరిచేసుకుంటే ఫొటో తీసుకుంటామని చెబుతున్నారు. దీని కోసం ఆమె మున్సిపల్ అధికారుల చుట్టూ తిరుగుతూ ఆన్‌లైన్‌లో తన పేరు తప్పుగా వచ్చిందని దానిని మార్చాలని కాళ్లావేళ్లా పడుతున్నది. అధికారులు మాత్రం ఇప్పుడు పేర్లు మార్చుకునే అవకాశం లేదని, మార్చే అవకాశం ఉన్నప్పుడు మారుస్తామని చెబుతున్నారు. డేటా ఆపరేటర్ చేసిన తప్పిదానికి తను ఇందిరమ్మ ఇంటికి అర్హురాలినైనా అధికారులు తన వివరాలు నమోదు చేసుకోవడం లేదని జిల్లా అధికారులైనా స్పందించి తనకు న్యాయం చేయాలని, ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని కోరుతున్నది.